క్లుప్తంగా

సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

గోకవరం: మండలంలోని పలు సచివాలయాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ గోవిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహించే ఆధార్ ప్రత్యేక శిబిరాల్లో ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు కొత్త ఆధార్ నమోదు, ఆధార్‌లో మార్పులు, చేర్పులు, పేరు, చిరునామా మార్పులు వంటివి చేసుకోవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే ఈ ప్రత్యేక శిబిరాలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 22న అచ్యుతాపురం, కామరాజుపేట-1, గంగంపాలెం సచివాలయాల్లోనూ, 23న వెదురుపాక, కామరాజుపేట-2, తిరుమలాయపాలెం , 24న గాదెలపాలెం, కృష్ణునిపాలెం, రంపయర్రంపాలెం-1, 25న తంటికొండ, గుమ్మళ్లదొడ్డి, రంపయర్రంపాలెం-2 సచివాలయాల్లో ఆధార్ సర్వీసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత పత్రాలు, రుసుముతో ప్రజలు సంప్రదించాలన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో విజయం సాధించాలి



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని పరిచయం చేస్తున్న యనమల

తుని రూరల్: శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు అన్నారు. ఆదివారం తుని మండలం తేటగుంటలో తన క్యాంపు కార్యాలయంలో భాగస్వామ్య పక్షాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి అభ్యర్థి రాజశేఖర్‌ను పరిచయం చేశారు. ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహం, పట్టభద్రులను ఓటర్లగా నమోదు చేయడం తదితర అంశాలపై సూచనలు చేశారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, తుని మున్సిపల్ మాజీ చైర్మన్లు కుసుమంచి శోభారాణి, యినుగంటి సత్యనారాయణ, నాయకులు ఎర్ర వేణు గోపాల రాయుడు, సుర్ల లోవరాజు, చింతంనీడి నాగసోమరాజు, మోతుకూరి వెంకటేష్, మూడు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వ్యాస్కులర్ వైద్య శిబిరం

ప్రత్తిపాడు: శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్తిపాడు శ్రీసత్యసాయి సేవా భవనంలో ఆదివారం ఉచిత వ్యాస్కులర్ వ్యాధుల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీనియర్ న్యాయవాది కొల్లా వీర్రాజు ప్రారంభించారు. ఈ శిబిరంలో ఏషియన్ వ్యాస్కులర్ ఆసుపత్రి వైద్యులు సోమాచారి, స్వాతిలు సుమారు 250 మందికి రూ.4,500లు విలువ గల డాప్లర్ అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా వైద్య విభాగం కోఆర్డినేటర్ ఎ సత్తిబాబు, జిల్లా విద్యాజ్యోతి కోఆర్డినేటర్ జె సాయిసూర్య లక్ష్మి, సేవా సమితి ప్రతినిధులు ఒబ్బిలిశెట్టి భద్రి, కొమ్ముల జయబాబు, ఎస్వీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడన ప్రభావంతో రైతుల్లో ఆందోళన

తొండంగి: అడపాదడపా బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనాలు రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం తుపాను ప్రభావం తప్పిందని ఊపిరి పీల్చుకునే లోపునే మరో అల్పపీడనం రెండు రోజుల్లో ఏర్పడనుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. దీనికి ఆధ్యం పోస్తూ ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారి అక్కడక్కడా మోస్తారు వర్షం కురిసింది. ప్రస్తుతం వరిచేలన్నీ పొట్ట దశనుంచి కోత దశలో ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అల్పపీడనంతో వర్షాలు కురిస్తే పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వీఓఏలకు కోర్టు ఆదేశాలతో ఊరట

తొండంగి: రాజకీయ ఒత్తిడులతో సెర్ప్ ద్వారా డ్వాక్రా వీవోఏలను తొలగించిన నేపథ్యంలో కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఊరట లభించింది. మండలంలోని సుమారు 19 మందిని రాజకీయ కారణాలతో దీర్ఘకాలంగా డ్వాక్రా వీవోఏలుగా పని చేస్తున్నవారిని తొలగించారు. వీరిలో కొంతమంది హైకోర్టులో రిట్ పిటీషన్ వేసుకున్నారు. తమను యధావిధిగా కొనసాగించాలని కోర్టు ఆదేశాలిచ్చినట్టు వీవోఏలలో ఒకరైన ఒంటిమామిడి వీవోఏ పి.విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈమేరకు డీఆర్‌డీఏ అధికారులు కోర్టు ఆదేశాలను ఎంత వరకూ పాటిస్తారనేది తెలియాల్సి ఉంది.

24 నుంచి గ్రామసభలు

గండేపల్లి: ఈనెల 24 నుంచి రీ సర్వే గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. 24న బొర్రంపాలెం, 25న తాళ్లూరు, 26న యర్రంపాలెం, 29న సింగరంపాలెం, 30న ఎస్టీ రాజాపురంలో సభలు జరగనున్నట్టు తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- గ్రామాల్లో గుంపులుగా సంచారం
- బాటసారులు, వాహనచోదకులపై దాడి
- గాయాలతో ఆస్పత్రి పాలవుతున్న జనం
- గోకవరంలో రెండు రేబిస్ మరణాలు
- నిర్మూలనకు చర్యలు చేపట్టాలని వినతులు



గోకవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

గోకవరం: గోకవరం మండలంలో వీధి కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. నిత్యం ఏదో ఒక గ్రామంలో ప్రజలు వీటి బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. విచ్చలవిడిగా పెరిగిపోతున్న వీధి కుక్కలను నిర్మూలించాలని ప్రజల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. గోకవరం మండలంలో 14 పంచాయతీలు ఉండగా సుమారు 30 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిలో ప్రతి గ్రామంలో దాదాపు వందకు పైగా వీధికుక్కలు ఉన్నాయి. మండల కేంద్రమైన గోకవరంలో ప్రతీ వీధిలో కుక్కలు గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి. ఆదేవిధంగా ప్రధాన రహదారిపై వందల సంఖ్యలో కుక్కలు గుంపుగా సంచరిస్తూ రహదారిపై రాకపోకలు సాగించే వారిపై దాడులకు తెగబడుతున్నాయి. వీటి దాడిలో నిత్యం అనేక మంది గాయపడుతున్నారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులను వీధికుక్కలు వెంబడిస్తుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. రెండు రోజుల క్రితం ఇద్దరు యువకులు ప్రయాణిస్తున్న బైక్‌ని వీధికుక్కలు వెంబడించడంతో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవల రంపయర్రంపాలెం గ్రామంలో వీధికుక్క దాడిలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అచ్యుతాపురం లో గతేడాది పిచ్చికుక్క దాడిలో పలువురు తీవ్రంగా గాయపడగా పశువులు సైతం దాని బారిన పడ్డాయి. గడచిన ఏడాది కాలంలో మల్లవరం, గోకవరం, తంటికొండ, కొత్తపల్లి గ్రామాల్లో పిచ్చికుక్క స్వైర విహారంతో అనేక మంది గాయపడ్డారు. విద్యార్థులను పాఠశాలలకు ఒంటరిగా పంపించాలంటే తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. మండలంలో ఇప్పటి వరకు రెండు రేబిస్ మరణాలు సంభవించాయి. పిచ్చికుక్క కాటుకు గురై గోకవరం, కొత్తపల్లి గ్రామాల్లో ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. మండలంలోని గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్, కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వినియోగం రోజురోజుకు పెరిగిపోతుంది. కుక్కల నిర్మూలనపై ఆంక్షలు ఉండటంతో పంచాయతీ అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. విచ్చలవిడిగా పెరిగిపోతున్న వీధి కుక్కల నిర్మూలనకు వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తే సమస్య పరిష్కారం అవుతుందనే అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతుంది. దీనిపై అధికారులు స్పందించి వీధికుక్కల నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వ్యాక్సిన్ వేయించుకోవాలి



గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కుక్క కాటుకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. కుక్క కరిచిన వెంటనే ఆస్పత్రికి వచ్చి వ్యాక్సిన్ వేయించుకోవాలి. వ్యాక్సిన్ వేయించుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉంది.

– **డాక్టర్ వనజాకుమారి**, సూపరిండెంట్, గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్.

వీధి కుక్కలను నిర్మూలించాలి



రోజు రోజుకు వీధికుక్కల స్వైర విహారం పెరిగిపోయింది. వీధులతో పాటు ప్రధాన రహదారిపై కుక్కలు గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి. ఒక్కసారిగా కనిపించిన వారిపై దాడి చేస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నాం. అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి.

– **బద్దిరెడ్డి తాతాజీ**, విశ్రాంత ఉపాధ్యాయుడు, గోకవరం.

దేవీచౌక్ ఆలయం వద్ద అన్నదానం



ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదానం

గోకవరం: గోకవరంలో ప్రసిద్ధి గాంచిన దేవీచౌక్ ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నదానం జరిగింది. శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.4 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. భక్తుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల మంది పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

పశు వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ముద్రగడ

రౌతులపూడి: జిల్లా పశు వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శిగా రౌతులపూడి పశువైద్యాధికారి ముద్రగడ వీర రాఘవరావు ఎంపికయ్యారు.ఈ మేరకు ఆయనను మండలంలోని వివిధ శాఖల అధికారులు, పశు వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

వానరాల స్వైర విహారం

- పాదచారులపై దాడి
- ఇళ్లు, దుకాణాల్లోకి చొరబాటు
- నష్టపోతున్న వ్యాపారులు
- వరి, అరటి, అపరాల పంటలు ధ్వంసం



ఏలేశ్వరంలో రహదారిపై కోతుల గుంపు

ఏలేశ్వరం: పట్టణంలో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ ప్రదేశాలతో పాటు ఇళ్లలోకి చొరబడుతుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. జనావాసాల మధ్య తిరగడంతో పాటు ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. ఇటీవల శివాలయం వీధిలో మహిళపై దాడి చేయడంతో పాటు పూజారిని గాయ పరిచాయి. సాయిబాబా మెట్ట వద్ద రహదారులపై గుంపులుగా తిరుగుతూ వాకర్స్, భక్తులను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. దుకాణాలపై దాడులు చేసి వ్యాపారులను నష్ట పరుస్తున్నాయి. గుంపుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. ముఖ్యంగా అరటి, వరి, అపరాల పంటలను నాశనం చేయడంతో రైతులు నష్టపోతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారులను కప్పేస్తున్న తుప్పలు

- మలుపుల్లో ప్రమాదాలు
- విష సర్పాల సంచారం
- తొలగించాలని వాహన చోదకుల వినతి



తుని-నర్సీపట్నం రోడ్డులో పెరిగిన తుప్పలు

తుని రూరల్: మండలంలో రహదారుల వెంబడి తుప్పలు గుబురుగా పెరిగి పోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖలకు చెందిన రహదారుల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. గుబురుగా పెరిగిన తుప్పలతో ఎదురుగా వాహనాలు వస్తున్నాయో లేదో తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యగా తుని, నర్సీపట్నం రోడ్డు, తుని నుంచి జగన్నాథగిరి మీదుగా లోవ దేవస్థానం రోడ్డు, తుని, కొలిమేరు, ఎస్.సూరవరం మీదగా కొట్టాం వెళ్లే రోడ్డు, ఎస్.చామవరం, హంసవరం, తొండంగి మండలం కృష్ణాపురం వెళ్లే రహదారుల్లో తుప్పలు దట్టంగా పెరిగి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వివిధ గ్రామాల మధ్య అంతర్గత రోడ్లలో ఇవి మరింతగా పెరిగిపోయాయి. వర్షాలు కురుస్తుండడంతో తుప్పలలోనూ, బయట విష సర్పాలు సంచరిస్తూ ప్రయాణికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

పాతకొట్టాంలో పారిశుధ్యం అధ్వానం



పాతకొట్టాంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

కోటనందూరు: పాతకొట్టాం పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. పంచాయతీ పరిధిలో ఉన్న నాలుగు గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి పందులు సంచరిస్తున్నాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్లలోని మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగా ఉండడంతో కలుషిత వాతావరణం ఏర్పడి పలువురు రోగాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రోగాలు పెచ్చు మీరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గండేపల్లి: మండలంలోని గండేపల్లి జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై శివనాగబాబు వివరాల మేరకు గ్రామానికి చెందిన కాజులూరి వెంకటరమణ (60) రాజమహేంద్రవరం మార్గం వైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్లే మార్గానికి వెళ్లేందుకు స్థానికంగా ఉన్న ఎస్బీఐ ఎదురుగా రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో విశాఖ వైపు వెళుతున్న వ్యాన్ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య



కోటనందూరు బస్టాండు సెంటర్లో మరిడమ్మ గుడి వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

కోటనందూరు: స్థానిక బస్టాండు సెంటర్లో నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. ప్రధానంగా మరిడమ్మ గుడి ప్రాంతంలో బైక్ మెకానిక్‌లు రోడ్డు పైనే మెకానిక్ చేస్తుండడంతో ఆ ప్రాంతంలో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పించుకునే వీలులేక రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ ప్రాంతంలో దుకాణదారులు రోడ్డును ఆక్రమించేయడం ట్రాఫిక్ సమస్యకు ఆజ్యం పోస్తోంది. దుకాణదారులు, మోటారు మెకానిక్‌లు ప్రయాణికుల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పందుల సంచారంతో అవస్థలు



పట్టణంలో గుంపుగా సంచరిస్తున్న పందులు

ఏలేశ్వరం: పట్టణంలో పందుల సంచారం విపరీతంగా ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్థానిక దిబ్బలపాలెం, పెద్దవీధి, తోటవీధి తదితర కాలనీల్లో వీటి సంచారం ఎక్కువగా ఉంది. రహదారులపై గుంపుగా తిరుగుతూ దుర్గంధం వెదజల్లుతున్నాయి. వర్షాలతో పాటు పందుల సంచారంతో పిల్లలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పందుల యజమానులతో పలు సమావేశాలు నిర్వహించిన మున్సిపల్ అధికారులు వారికి పలు ఆంక్షలు విధించారు. పందుల సంచారం సమస్య పక్కన పెట్టి గుడ్ మార్నింగ్ పేరుతో ప్రచారానికి అధికారులు పరిమితమవ్వడంపై విమర్శలు వస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని వీటిని నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



శరభవరంలో పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు రూరల్: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని శరభవరం, గజ్జనపూడి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, గ్రామ సర్పంచ్ మంతిన శ్రీను, పార్టీ నాయకులు అమరాది వెంకట్రావు, ఇళ్ల అప్పారావు, కురందాసు అప్పలరాజు, పల్లా గోపి, దాకారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

రౌతులపూడి: గ్రామాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎస్.ఎస్.పట్నం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్.అగ్రహారం, పారుపాక గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమరాన సత్యనారాయణ, లాలం అప్పలనాయుడు, పడాల తిరుమలదొర, కిల్లాడ వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'తాటకి సంహారం' నాటిక



'తాటకి సంహారం' వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరి శంకరుల 88వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక కళాకారులు తాటకి (రాక్షసి) సంహారం వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని నందిసెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో రాముడిగా పిట్టి మాణిక్యం, లక్ష్మణుడుగా అప్పికొండ విజయ్, విశ్వామిత్రునిగా నానిపల్లి అప్పలస్వామి, తాటకిగా నానిపల్లి వెంకన్న నటించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్-డ్రెస్సింగ్ చేశారు. ముందుగా గౌరమ్మకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నాటక ప్రదర్శనను ప్రారంభించారు.

ఏలేరులో 85.53 మీటర్ల నీటి నిల్వలు



ఏలేరులో నీటి నిల్వలు

ఏలేశ్వరం: ప్రస్తుతం ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు స్థిరంగా ఉన్నాయి. ఆదివారం నాటికి ప్రాజెక్టులో 85.53 మీటర్ల నీటి నిల్వలు ఉన్నాయి. జలాశయం పరివాహక ప్రాంతం నుంచి 1,024 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టులో 86.56 మీటర్లకు గాను 85.53 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 22.02 టీఎంసీల నీటినిల్వలు చేరుకున్నాయి. దీంతో ఆయకట్టుకు 1,100, విశాఖకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా పంపా, తిమ్మరాజు చెరువుకు నీటి విడుదల నిలిపివేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



గొంరంపేటలో చెత్తను తొలగిస్తున్న జేసీబీ

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గొంరంపేట గ్రామంలో ఆదివారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీయించారు. గ్రామం నలు మూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచకారీ చేశారు. గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఏసుబాబు సూచించారు.

